# గుమ్మటం

ఫ్రెంచ్ మూలం:
గై ద మపాసా

అనువాదం:
కాకాని చక్రపాణి




ప్రష్యన్లు రూవెన్ పట్నంలోకి ప్రవేశించారు. వీథుల్లో ప్రష్యను సైనికుల గస్తీ. జనం వీథుల్లోకి రావటానికి భయపడుతున్నారు. తలుపులు గడియ పెట్టుకుని ఇండ్లలోనే వుండిపోతున్నారు. కొంతమంది సైనికులు తలుపులపై టకటక కొట్టారు. బిక్కచచ్చిపోయిన జనం తలుపు తీయగానే లోపలికి ప్రవేశిస్తున్నారు. దాడి తరువాత, అన్నిటినీ స్వాధీనం చేసుకోటం అది. విజేతల పట్ల విధేయుంగా వుండాల్సిన బాధ్యత మొదలైంది విజితులకు.

కొంత కాలమయాక ఫ్రెంచ్ ప్రజలకు మొదటున్న భయం పోయింది. కొత్తరకం ప్రశాంతత నెలకొన్నది. ప్రష్యను ఆఫీసరు ఇంట్లో భోంచేస్తాడు. మంచి కుటుంబంలో నుంచి వచ్చిన మనిషే అతను. మర్యాదస్తుడే. ఫ్రాన్సు పట్ల జాలి వుంది. తన





# ఇది నీకు తగదు ఐశ్వర్యా!

'హమ్ దిల్ దే చుకే సనమ్' చిత్రంతో బాలీవుడ్‌లో మరో క్లియోపాత్ర పుట్టిందన్నారు అంతా. తరువాత 'తాల్'తో ఆ నటిని అదృష్టం అందలం ఎక్కించింది. బాడీఖాన్ సల్మాన్‌తో ఆమె ప్రేమాయణం బాలీవుడ్ వీథుల్లోకెక్కి అందరికీ తమాషా అయింది. ఎదురుదెబ్బలు తట్టుకుని నిలబడటం నేర్చుకుని, ధైర్యంగా కెరీర్‌తో ముందుకు సాగుతున్న ఆ నటి ఐశ్వర్యారాయ్. ఇవాళ ఆమె సక్సెస్ స్టోరీలు చెప్పుకునేవారు కరవయ్యారు. ఆమెకున్నవి రెండే రెండు చిత్రాలు-సంజయ్‌లీలా భన్సాలి 'దేవ్‌దాస్', డేవిడ్ ధవన్‌ది 'హమ్ కిసీ సే కమ్ నహీఁ'. 'అస్తిత్వ' తీసి సూపర్ దర్శకుడనిపించుకున్న మహేశ్ మాంజ్రేకర్ తన చిత్రంలో చేయమని ఐశ్‌నడిగాడట. ఆయన వినిపించిన స్క్రిప్టులో ఇద్దరు హీరోలున్నారు-సంజయ్ దత్, సల్మాన్ ఖాన్. ఐశ్వర్య కాకుండా మరో హీరోయిన్ కూడా వుంటుందనీ, ఆ ఇద్దరు హీరోయిన్లలో ఐశ్ ఒకమ్మాయిగా నటించాలనీ మహేశ్ చెప్పాడు. స్క్రిప్టు విన్న ఐశ్ చాలా ఎగ్జయిట్‌మెంట్‌లో పడి, ఆ ప్రాజెక్టును వదులుకోకూడదని నిశ్చయించుకుంది. కానీ తను ఇటీవలే తీసుకున్న నిర్ణయం ఇద్దరు హీరోయిన్ల చిత్రాల్లో చేయకూడదని. అందుకనీ, ఆ చిత్రం పోగొట్టుకోవటానికి ఇష్టం లేకా, "నాకు మీ చిత్రంలో చేయాలని ఎంతో ఇదిగా వుంది చాలా కాలం నుంచీ. కానీ ఇద్దరు హీరోయిన్లుండేవి చేయకూడదనుకున్నాను కనుక ఒక పని చేద్దాం. ఆ రెండు పాత్రలూ నేనే చేస్తే ఎలాగుంటుంది? అట్లా మీ స్క్రిప్టుకు కూడా న్యాయమే జరుగుతుంది. పైగా నేను ద్విపాత్రాభినయం చేస్తున్నందుకు పారితోషికం కూడా ఎక్కువడగను. లేకపోతే ఒకే హీరోయిన్ వుండేలా మీ కథను తిరగరాసుకోండి" అందిట. షాక్ తిన్న మహేశ్ అలాగుండిపోయాట్ట. కొందరు దర్శకులు తమ చిత్రాలు స్టార్లు చేస్తే బాగుంటుందనుకుంటారు. మరి కొందరు స్టార్లను సృష్టిస్తారు. రెండో కోవకు చెందిన దర్శకుడు మహేశ్. అతను ఎలాంటి పరిస్థితిలోనూ తన స్క్రిప్టులో వెంట్రుక వాసి కూడా ఛస్తే మార్చడు. కనుక ఐశ్‌కే 'సయోనారా' చెప్పేశాట్ట. చిత్రం ప్రారంభించక ముందే ఇంతగా డామినేట్ చేయటానికి ప్రయత్నిస్తోందే, చిత్రం మొదలైపోతే తన పని ఇంక ఆఖరేననుకున్నట్టున్నాడు. ఇప్పుడా చిత్రంలో సల్మాన్, సంజయ్ కాకుండా సునీల్ శెట్టి, అజయ్ దేవగణ్ హీరోలు. కానీ గొప్ప సౌందర్యవతినని గర్వించిన క్లియోపాత్రకే అధోగతి పట్టిందనే సంగతి ఐశ్ మరిచిపోకూడదు. తనను స్టార్ చేస్తానని వచ్చిన దర్శకుడికి సలహాలివ్వబూనడం... సిరి రా మోకాలొడ్డినట్లయింది కదా!

ఎన్.

కిష్టం లేకపోయినా తప్పదు. ఇంటి యజమాని అలాంటి భావాలున్న ప్రష్యను ఆఫీసరు పట్ల కృతజ్ఞత వ్యక్తపరుస్తాడు. అతిథిమర్యాదలు చేస్తాడు. జనం ఇప్పుడు వీథుల్లోకి వెళ్తున్నారు. వీథుల్లో గస్తీ తిరుగుతున్న ప్రష్యను సైనికులిప్పుడు అంత అహంకారం ప్రదర్శించటం లేదు. విజేతలు ఇంట్లో ప్రవేశించాక డబ్బివ్వమని అడిగేవాళ్లు. ఇవ్వకతప్పదు ఫ్రెంచ్ ప్రజలకు. ధనవంతులైన నగరవాసులకు ఇది మరీ సంకటమైంది.

చివరికి ఆక్రమణదారులు తమ బెసకని క్రమశిక్షణతో నగరాన్ని పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. విజితప్రజ పట్ల కిరాతకంగా ప్రవర్తించలేదు. జనం ఇప్పుడు మెల్లమెల్లగా ధైర్యం కూడగట్టుకోసాగారు. వర్తకవాణిజ్యాలు కొనసాగించారు. కొంతమందికి హావ్రేలో వ్యాపారాలున్నాయి; అది ఫ్రెంచ్ సైనికుల అధీనంలోనే వుంది. దీపే దాకా బండిలో వెళ్లి, అక్కడి నుంచి పడవలో హావ్రే రేవుపట్నం చేరుకోవాలనుకున్నారు. జర్మను సైనికుల దగ్గర తమకున్న పలుకుబడిని వినియోగించారు వాళ్లు. చివరికి సైన్యాధికారి వాళ్లు రూవెన్ నగరం విడిచివెళ్లటానికి అనుమతించాడు. ప్రయాణానికి నాలుగు గుర్రాలు పూన్చిన పెద్ద బండిని వాళ్ల కోసం సిద్ధం చేశారు. పదిమంది అందులో సీట్లు రిజర్వు చేసుకున్నారు. గుట్టుగా, మంగళవారం తెల్లవారు జామునే బయలుదేరి వెళ్లిపోవాలని వాళ్లనుకున్నారు.

ఆ రోజు తెల్లవారు జాము నాలుగున్నరకు ప్రయాణికులంతా హోటల్ నార్మండీ ఆవరణలో జమయ్యారు. విపరీతమైన చలిగా వుంది. ఉన్నిగుడ్డలు కప్పుకున్నారు. ఆ అస్పష్టమైన వెలుగులో ఎవరు ఎవరో వాళ్లకు తెలియలేదు.

వాళ్లలో ఒకతనన్నాడు: "మేం మళ్లీ రూవెన్‌కు తిరిగి రాం. ప్రష్యన్లు హావ్రేను కూడా పట్టుకుంటే, మేం ఇంగ్లాండు వెళ్లిపోతాం."

మిగిలిన వాళ్లూ అదే భావాన్ని వ్యక్తపరిచారు.

గుర్రబ్బండి సిద్ధమైంది. నాలుగు గుర్రాలకు బదులు ఆరింటిని బండికి కట్టారు. మంచు ముక్కలు ముక్కలుగా కురుస్తోంది. ప్రయాణం కష్టం. అందుకే ఆరు గుర్రాలను పూన్చారు. ప్రయాణికులంతా బండి ఎక్కాక బండి కదిలింది. బండి చక్రాలు మంచులో కూరుకుపోతుండటంతో ప్రయాణం మెల్లగా సాగింది. బండివాడు గుర్రాలను అదిలిస్తున్నాడు, చర్నాకోల ఝళిపిస్తున్నాడు. అయినా ప్రయాణం మెల్లగానే కొనసాగింది. కొంత దూరం ప్రయాణించాక తెల్లవారింది. అందరూ తమ తోటి ప్రయాణికులెవరో తెలుసుకోవాలనే కుతూహలంతో ఒకళ్లనొకళ్లు చూచుకున్నారు.

బండిలో వెనక మొదటిసీటులో ల్వాసో కూర్చునివున్నాడు. మద్యవ్యాపారి. తనకింతకు ముందు ఉద్యోగం ఇచ్చిన వ్యాపారి వ్యాపారంలో చితికిపోతే, అతని వ్యాపారాన్ని కొని, దాన్ని బాగా అభివృద్ధి చేసి లక్షలు గడించాడు ల్వాసో. నాసిరకం మద్యం రిటైలర్లకు అమ్మేవాడు. స్నేహితులూ, తోటివ్యాపారస్తులూ "అమ్మో,



గై ద మపాసా

గై ద మపాసా ఎమిలీ జోలా బృందానికి చెందిన ప్రాకృతికవాది (నేచురలిస్ట్), ఫ్రెంచ్ రచయిత. జోలా 'ది ఎక్స్‌పెరిమెంటల్ నావెల్' 1880లో శాస్త్రీయబద్ధమంటూ మానవసిద్ధాంతవాద (థియరీ ఆఫ్ హ్యూమన్ డిటర్మినేషన్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వంశపారంపర్యంగా వచ్చే లక్షణాల వల్లా, సామాజికకారణాల వల్లా మనిషి బంధితుడని ఆయన సిద్ధాంతం. భిన్నమనస్తత్వాలున్న మనుషులను, కొన్ని సామాజికపరిస్థితుల్లో వుంచి, లాబరేటరీలో రసాయనశాస్త్రవేత్త రసాయనిక చర్య, ప్రతిచర్యలను గమనించినట్లు, రచయితా తన ఎక్స్‌పెరిమెంటును చేయాలనీ, ఫలితాలను వివరించటమే అతని పని అనీ ఎమిలీజోలా చెప్పారు.

గై ద మపాసా 1850 ఆగస్టు 5న నార్మండీలో జన్మించాడు. 1893 జులై 6న మరణించాడు. ప్రఖ్యాత ఫ్రెంచ్ కథకుల్లో ఈయన ఒకడు. ఆయన బాల్యం సుఖంగా గడవలేదు. ఆయనకు పదకొండేళ్ల వయసులో తల్లిదండ్రులు విడిపోయారు. ఆయనను తల్లి పెంచి పెద్ద చేసింది. తండ్రి అంటే ఆయనకు మహాద్వేషం. భర్తలనేవాళ్ల నందరినీ అసహ్యించుకునే వాడాయన. తను జీవితంలో పెళ్లి చేసుకోలేదు. ఫ్రాంకో, ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు, న్యాయశాస్త్రం అభ్యసించాడు, ప్రభుత్వోద్యోగం చేశాడు. ఈ రంగాల్లోని అనుభవాలన్నీ ఆయన కథల్లో, నవలల్లో ప్రతిబింబితమవుతాయి. ఆయన కళాత్మకజీవితంపై గాఢప్రభావం చూపిన కుటుంబమిత్రుడూ, రచనాగురువూ అయిన గస్టావ్ ఫ్లాబర్ట్, ప్రముఖ నవలాకారులైన ఎమిలీ జోలా, హెన్రీ జేమ్స్‌లతో పరిచయం చేశారు.

మపాసా ఆరు నవలలూ, మూడు వందలకు పైగా కథలూ రాశాడు. రచనలో ఎంతో జాగ్రత్త చూపేవాడు మపాసా. మాటల్లో పొదుపు, వ్యంగ్యభరితశైలి, ముక్కుసూటిగా కథనం చేయగల శక్తి ఆయనకు లభించిన వరాలు. ఆయన రాసిన నవలల్లో చెప్పుకోవలసినవి 'బెల్‌అమీ'-1885, 'పియర్రీ అండ్ జీన్'-1888.

సిఫిలిస్ జబ్బు ఆయనను క్రుంగదీసింది. పూర్తిగా మతిపోయిన పరిస్థితుల్లో పిచ్చాసుపత్రిలో మరణించాడు. మపాసాకు మంచి పేరు తెచ్చిన కథ 'బాల్ డీ సూయిఫ్' లేదా 'బాల్ ఆఫ్ ఫాట్'. ఇది చాలా పెద్ద కథ. ప్రష్యన్లు ఫ్రాన్సును ఆక్రమించుకున్న నేపథ్యంలో ఈ కథను కుదించి 'గుమ్మటం' అనే పేరుతో అనువదించారు రచయిత.

దొంగనాకొడుకు!" అనుకునేవాళ్లు. సరదాగా వుండే మనిషి. అతని భార్య అతని ఎదుటి సీటులో కూర్చుని వుంది.

అతని పక్కన కారే లమడాన్ ఠీవిగా కూర్చునివున్నాడు. పత్తి వ్యాపారంలో బాగా సంపాదించాడు. మూడు మిల్లులున్నాయతనికి. జనరల్ కౌన్సిలు మెంబరు కూడా. అతని కెదురుగా అతని భార్య కూర్చునివుంది. వయసులో అతని కంటే చాలా చిన్నది. సన్నగా, అందంగా వుంది.

ఆమె పక్కన బ్రెవిల్ జమీందారిణి, ఆమె కెదురుగా జమీందారు కూర్చున్నాడు. 'ది బ్రెవిల్'లు ప్రాచీనరాజవంశానికి చెందినవాళ్లు. జమీందారు వయసులో పెద్దవాడే అయినా, బలంగా, ఆరోగ్యంగా వున్నాడు. బ్రెవిల్ కుటుంబంలోని ఓ స్త్రీని రాజు మోహించి, ఆమెకు కడుపు చేస్తే, రాజు ఆమె భర్తకు జమీందారీని ప్రసాదించాడని చెప్పుకుంటారు. జమీందారు హ్యూబర్ట్ కూడా జనరల్ కౌన్సిలు మెంబరు. కారే లమడాన్‌తో అతనికి పరిచయముంది. జమీందారిణి 'సెలోన్' గురించి గొప్పగా చెప్పుకుంటారు. అందులో ప్రవేశం అంత తేలిగ్గా లభించదు. జమీందారు బాగా ధనవంతుడు.

ఆ ఆరుగురూ బండిలో మూలస్తంభాల లాంటివాళ్లు. సభ్యసమాజానికి ప్రాతినిధ్యం వహించేవాళ్లు. ప్రశాంతంగా, నిజాయితీగా బతికేవాళ్లు. వాళ్లకు మతం పట్ల అనురక్తి వుంది, జీవితవిలువలున్నాయి.

జమీందారిణి పక్కన కూర్చున్నవాళ్లు ఇద్దరు నన్‌లు. చేతుల్లో పూసలదండలు పట్టుకుని జపం చేసుకుంటున్నారు. ఈ భక్తురాళ్ల కెదురుగా ఓ పురుషుడూ, స్త్రీ కూర్చునివున్నారు. పురుషుడి పేరు కార్నుడే. ప్రజాస్వామ్యవాది. గౌరవనీయులకు అతడంటే భయం. తండ్రి సంపాదించి ఇచ్చిన ఆస్తి బాగా వుంది అతనికి. ప్రజాస్వామ్యవర్గాల్లో అతనికున్న పేరు, పదవికి కారణం అతను విపరీతంగా ఖర్చు పెట్టగలగడమే నంటారు. ఇప్పుడు రూవెన్‌లో కంటే హావ్రేలో తను చేయాల్సిన ప్రజాసేవ అధికమని భావించి అతనా ప్రయాణానికి సిద్ధపడ్డాడు.

అతని పక్కన-'వగలాడి' అని పిలుస్తారే, అలాంటి స్త్రీ కూర్చునివుంది. లావుగా వుంటుంది. అందుకే 'గుమ్మటం' అన్న నిక్‌నేమ్‌తో అందరూ పిలుస్తుంటా రామెను. చేతివేళ్లు కూడా లావుగానే వుంటాయి. ముఖం ఆపిల్ పండులా గుండ్రంగా వుంటుంది. నల్లటికళ్లు, పెద్ద కనుబొమలు, ఆకర్షణీయమైన నోరు, చిన్న పలువరస; విస్తృతవక్షస్థలం బట్టల వెనక ఊగుతూవుంటుంది. ఆమెలో ఏదో తాజాదనం వుంది, చురుకుదనం వుంది. అవే అమె అంటే ఇతరులు ఇష్టపడటానికి కారణాలు.

ఆమెను గుర్తుపట్టగానే సభ్యస్త్రీలు చెవులు కొరుక్కున్నారు. "వేశ్య", "కళంకం" లాంటి వ్యాఖ్యలు వినబడగానే ఆమె వాళ్లను రెచ్చగొట్టేట్టుగా, నిబ్బరంగా వాళ్ల వంక చూసింది. అందరి నోళ్లూ పడిపోయాయి. నిశ్శబ్దం రాజ్యం చేసింది. అప్పటిదాకా ముభావంగా వున్న స్త్రీలు, ఆమె అక్కడ వున్న కారణంగా, అమాంతం స్నేహపూర్వకంగా, సన్నిహితంగా మాట్లాడుకోసాగారు. సిగ్గు లేకుండా ఒళ్లమ్ముకోటం కంటే వైవాహికజీవితం ఎంత సుఖప్రదమో ఆమెకు తెలియజెప్పటమే వాళ్ల లక్ష్యమన్నట్టుంది వాళ్ల సంభాషణ. కార్నుడేను చూడగానే ముగ్గురు పురుషపుంగవుల్లోనూ ఆత్మరక్షణభావం జాగృతమైంది. డబ్బును గురించీ, ప్రష్యను దండయాత్ర వల్ల కలిగిన నష్టం గురించీ వాళ్లు మాట్లాడుకోసాగారు.

బండి మెల్లగా వెళ్తోంది. ఉదయం పది గంటలైనా వాళ్లు నాలుగు కోసుల దూరం కూడా ప్రయాణం చెయ్యలేదు. తోత్స్‌లో అప్పటికల్లా వాళ్లు అల్పాహారం తీసుకుంటూ వుండాల్సింది. బండి రాత్రికి గాని తోత్స్‌కు చేరేట్టు కనిపించకపోటంతో వాళ్ల గుండెల్లో దిగులు ప్రారంభమైంది. తోవలో ఏదైనా చిన్న హోటలు కనిపిస్తుందేమోనని చూశారు. మంచులో కూరుకుపోయిన బండి చక్రాలను బయటికి తీయటానికి చచ్చిన చావైంది వాళ్లకు. ఆ పనిలోనే రెండు గంటల కాలం గడిచిపోయింది. క్రమంగా పెరుగుతున్న ఆకలి వాళ్ల మనసులను బాధించలాగింది. తోవలో ఎక్కడా హోటళ్లూ, మద్యం దుకాణాలూ తెరిచిలేవు. ప్రష్యను దండ్ల భయంతో అన్నీ మూతపడ్డాయి.

మధ్యాహ్నం ఒంటిగంట అయేసరికల్లా, తన కడుపులో ఎలుకలు పరుగెత్తుతున్నాయన్నాడు


ల్వాసో. అందరిదీ అదే పరిస్థితి. ఆకలి సంభాషణను మందగింపజేసింది. అందరూ సమాజంలో తమకున్న స్థానాన్ని బట్టీ, తమ శీలాన్ని బట్టీ, జీవితాన్ని గురించిన తెలివిడి బట్టీ ఆవులిస్తున్నారు. గుమ్మటం క్షణం సందేహించింది. చుట్టూ వున్నవాళ్ల వంక చూసింది. సర్దుకుకూర్చుంది. ఓ చిన్న మాంసం ముక్క ఇస్తే వెయ్యి ఫ్రాంకులు ఇస్తానన్నాడు ల్వాసో. అతని భార్య అతని వంక నిరసనగా చూసింది. డబ్బు దుబారా గురించి ఎవరు మాట్లాడినా ఆమె కిష్టముండదు.

"ఏవన్నా తినటానికి తీసుకొస్తే బావుండేది. నాకు అలాంటి ఆలోచనే తట్టలేదు ఎందుకో?" అన్నాడు జమీందారు. అందరూ అలాంటి ఆలోచనలోనే వున్నారు. కార్నుడే దగ్గర ఓ ఫ్లాస్కు రమ్ వుంది. "పుచ్చుకోండి" అంటూ అతను అందరికీ చెప్పాడు కానీ ఎవరూ దాన్ని స్వీకరించలేదు. ల్వాసో మాత్రం రెండు గుక్కలు తాగాడు. దాంతో కాస్తంత ఉత్సాహం వచ్చింది అతనికి. "ఆ పాటేదో-దాంట్లో ఓడ ప్రయాణికులు ఆకలికి తాళలేక కొవ్వు పట్టి, బలిసివున్న ప్రయాణికుణ్ని తింటారు చూశారూ-అలా మనమూ చెయ్యాలి" అన్నాడు. గుమ్మటాన్ని గురించిన ఈ పరోక్షవ్యాఖ్య సభ్యజనానికి బాగనిపించలేదు కానీ ఎవరూ మాట్లాడలేదు. కార్నుడే ఒక్కడే నవ్వాడు. ఇద్దరు క్రైస్తవసోదరీమణుల చేతుల్లోని పూసలు తిరగటం మానేశాయి.

చివరికి మూడు గంటలకు గుమ్మటం సీటు కింద నుంచి ఓ పెద్ద బుట్టను బయటికి లాగింది. కప్పివున్న నాప్‌కిన్‌ను తొలగించి, ఓ పింగాణీ పళ్లెం తీసింది. బుట్టలో మూడు రోజులకు సరిపడా ఆహారపదార్థాలున్నాయి. స్వీట్లు, పండ్లు, మరెన్నో వంటకాలు. ఆమె చికెన్ పళ్లెంలో వడ్డించుకుని తినసాగింది. అందరి దృష్టీ ఆమె వైపు పడింది. వంటకాల సువాసన వాళ్ల ముక్కుపుటాలపై దాడి చేసింది. వాళ్ల నోట్లో నీరూరసాగింది. దవడలు కుదించుకుపోసాగాయి. ఆమె పట్ల స్త్రీల హేయభావం ద్విగుణీకృతమైంది. ఆమెనూ, ఆమె బుట్టనూ మంచులోకి విసిరేయాలనిపించింది వాళ్లకు.

కానీ ల్వాసో కళ్లు చికెన్‌ను తినేస్తున్నాయి: "అదృష్టవశాత్తూ మేడం మన కంటే ముందుచూపున్న మనిషి" అన్నాడు.

ఆమె అతని వంక చూసింది. "తిండి లేకుండా ఇంతసేపు వుండటం కష్టం. మీరూ ఒక ముక్క పుచ్చుకోవచ్చుగా?" అన్నది.




"నిజం, నేనింక కాదనలేను. ఆకలికి తాళటం కూడా కష్టమే" అంటూ జేబులో నుంచి ఓ చాకు తీసి మాంసం కాలిముక్కకు గుచ్చి, ఆవురుమని తింటూ తృప్తిగా తేన్చాడు.

గుమ్మటం క్రైస్తవసోదరీమణులను ఆహ్వానించగానే, వాళ్లు మారుమాట్లాడకుండా ఆతిథ్యాన్ని స్వీకరించారు. కార్నుడే ఆతిథ్యాన్ని తిరస్కరించని మనిషి. అతనూ అందులో పాలు పంచుకున్నాడు. ల్వాసో భార్య కూడా, భర్త నచ్చజెప్పాక, తనూ కొవ్వు బంతి ఆతిథ్యాన్ని స్వీకరించింది. మిగిలిన నలుగురినీ రుచికరమైన వంటకాల పరిమళం బాధించసాగింది. అంతలో కారే లమడాన్ భార్య స్పృహ తప్పి పడిపోయింది. క్రైస్తవసోదరి గుమ్మటం తెచ్చిన ద్రాక్షసారాను ఓ కప్పు ఆమెకు పట్టించింది. ఆమెకు స్పృహ వచ్చింది.

అప్పుడంది గుమ్మటం: "మీ లాంటి పెద్దలను ఈ నా ఆహారం స్వీకరించమని అడగలేకపోయాను. అందుకు ధైర్యం చాలలేదు నాకు. కానీ మీరు-"

ల్వాసో అందుకున్నాడు "ఇలాంటి సమయంలో అందరం సమానులమే. మనం సోదరభావంతో మెలగాలి. ఇక ఔపచారికాల కోసం చూడకండి. ఉన్నది అందరం పంచుకుందాం. బండి నడక చూస్తుంటే మనం రేపు మధ్యాహ్నానికైనా తోత్స్‌కు చేరుతామో లేదోననిపిస్తున్నది."

ఇంక ఎవరూ సంకోచించలేదు. సాంఘికహోదాలను పక్కన పెట్టి ఆతిథ్యాన్ని స్వీకరించారు. గుమ్మటంతో మాట్లాడకుండా ఆ ఆతిథ్యాన్ని ఆ భద్రమహిళలు స్వీకరించలేరు. అందుకే, ముభావంగా మాట్లాడటం మొదలుపెట్టినవాళ్లు ఆ పైన గుండె తెరిచి మాట్లాడసాగారు. జమీందారిణీ, కారే లమడాన్ భార్య కింది వాళ్లను దయతో చూస్తున్నట్టుగా మాట్లాడారు. సహజంగానే సంభాషణ యుద్ధం వైపు మళ్లింది. గుమ్మటం ఆవేశంతో-కింది తరగతివాళ్లు అలా ఆవేశపడటం సహజమే-అంది:

"నిజానికి నాకూ రూవెన్ వదలిపెట్టాల్సిన పని లేదు. తెలియని చోటికి వెళ్లటం కంటే ఆ ప్రష్యను వెధవలు నా తిండి తింటే తిన్నారని సమాధానపడదామనుకున్నాను. కానీ, వాళ్లను చూస్తే నా ఒళ్లు మండిపోయేది. వాళ్లలో ఏ ఒక్కణ్నయినా చంపుదామన్నంత ఆవేశం వచ్చింది. నా మనసు బయటపడ్డాక ఇంక నేనక్కడ వుండని పరిస్థితి వచ్చింది. అవకాశం దొరగ్గానే ఇలా పారిపోయి వస్తున్నాను." ఆమె దేశభక్తి నందరూ మెచ్చుకున్నారు.

బుట్ట ఖాళీ అయింది. పదిగంటలకల్లా వున్నది పూర్తి చేశారు. ఇక తినటానికేం లేదే అని చింతించారు. సంభాషణ కొంతసేపు కొనసాగింది. అయితే, తినటం పూర్తయింది కనుక సంభాషణ అంత ఉత్సాహంగా సాగలేదు. బాగా చీకటి పడిపోయింది. పదమూడు గంటలు ప్రయాణించాక చివరికిబండి తోత్స్‌లోని కామర్స్ హోటల్ ముంగిట ఆగింది. బండి తలుపు తెరవగానే బయట ఓ జర్మను ఆఫీసరు నిలబడి కనిపించాడు. ప్రయాణికులకు గుండె చిక్కబట్టినట్టయింది. "దిగరేం, ఇంకా కూర్చున్నారు?" అన్నాడు ఆఫీసరు.

సాధుజీవనానికి అలవాటు పడ్డ క్రైస్తవసోదరీమణులు ముందుగా దిగారు. జమీందారు, ఆయన భార్య, పారిశ్రామికుడు, ఆయన భార్య, ల్వాసో, ఆయన భార్య వరసగా దిగారు. ల్వాసో ఆఫీసరుకు అభివాదం చేశాడు. మర్యాదకు కాదు, వివేకంతో చేసిన పని అది. గుమ్మటం, కార్నుడే తలుపు దగ్గరగా వున్నా చివరగా దిగారు. ఆమె తన కోపాన్ని అణచుకో ప్రయత్నిస్తున్నది. శత్రువు ఎదుట క్షుద్రంగా లొంగుబాటును ప్రదర్శించినవాళ్ల కంటే ఆమే ఆభిజాత్యాన్ని ప్రదర్శించింది. హోటలు కిచెనులోకి వెళ్లారు వాళ్లు. అక్కడ వాళ్ల ప్రయాణపత్రాలను (వాటిలో ప్రయాణికుల పేర్లు, వృత్తి వగైరా వివరాలుంటాయి) క్షుణ్ణంగా పరిశీలించాక, ఆఫీసరు, "ఆఁ, బాగానే వున్నాయి" అని వెళ్లిపోయాడు.

అతను వెళ్లగానే వాళ్లు గాలి పీల్చుకున్నారు. ఆకలిగా వుండటంతో భోజనానికి ఆర్డరు చేశారు. భోజనం తయారవటానికి ఓ అరగంట పడుతుంది. వాళ్లు తమ తమ గదులకు వెళ్లారు. చివరికి భోజనానికి టేబుల్ దగ్గరికి వచ్చి కూర్చున్నారు.

హోటలు యజమాని ఫాలెన్వీ వచ్చాడు. "ఇక్కడ ఎలిజబెత్ రూసేట, ఎవరూ?" అని అడిగాడు.

గుమ్మటం ఉలిక్కిపడింది. "నేనే" అని జవాబిచ్చింది.

"ప్రష్యను ఆఫీసరు గారు తమతో తక్షణం మాట్లాడాలిట."

"నాతోనా?"

"అవును. మీరే ఎలిజబెత్ రూసే అయితే."

ఆమె కలవరపడిపోయింది. ఓ క్షణం ఆలోచించి, జవాబిచ్చింది: "అది నా పేరే. కాని నేనక్కడికి వెళ్లను!"

కదలిక మొదలైంది జనంలో; అందరూ ఈ ఆదేశానికి కారణమేమిటో వితర్కించసాగారు. జమీందారు, "నువ్వు తప్పు చేస్తున్నావమ్మాయ్! నువ్వు తిరస్కరించటం నిన్నే కాదు, అందర్నీ కష్టాల్లో పడేస్తుంది. అధికారం వున్నవాళ్లను వ్యతిరేకించి ప్రయోజనం లేదు. ప్రమాదం ఏం లేదు, వెళ్లిరా. ఏదో ఫార్మాలిటీ మరిచిపోయుంటారు" అన్నాడు.

అందరూ అతనికి వంత పాడారు. వెళ్లమని బతిమిలాడారు, అర్థించారు. ఆమె అవిధేయత వల్ల వచ్చే అనర్థాలను గురించి అందరూ భయపడ్డారు. చివరికామె అంది: "సరే, మీ కోసమే వెళ్తున్నాను."

జమీందారు ఆమెతో చెయ్యి కలిపి, "నీ ఋణం మేం ఎప్పుడూ తీర్చుకోలేం" అన్నాడు.

ఆమె వెళ్లింది. తమకే అలా పిలుపొస్తే ఏం చేయాలా అని ఆలోచించసాగారు. పదినిమిషాల్లో ఆమె తిరిగి వచ్చింది, కోపంగా, ముక్కుపుటాలు అదురుతూవుంటే. "దొంగనాకొడుకులు!" అంది. మాటలు తడబడ్డాయామెకు.

అందరూ ఆమె చుట్టూ చేరారు, ఏం జరిగిందో తెలుసుకోటానికి. ఆమె ఆత్మగౌరవంతోనే స్పందించివుంటుందని జమీందారు మిగతావాళ్లతో అన్నాడు. "ఇది మీకు సంబంధించింది కాదు. అంత కంటే నేనేం చెప్పలేను" అంది.

టేబుల్ దగ్గర అందరూ భోజనాలు చేస్తున్నారు..

"ఈ మిలిటరీవాళ్లు మన్ని దోచేస్తున్నారు. ఎందుకా డ్రిల్లులూ, ఎక్సర్సైజులూ! అంత కంటే వాళ్ల దేశంలో పొలం దున్నుకుంటేనో, రోడ్లు వేసుకుంటేనో బాగుంటుంది. సైనికుడి వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. బీదా బిక్కీ జనం- వాళ్లకు తిండి పెట్టాలి, లేకపోతే వాళ్ల చేతిలో చావాలి. మనుష్యులను చంపటం ఎంత దుర్మార్గం! వేటలో జంతువులను చంపినట్లు చంపడం-ఛీ, ఛీ! నేనసలు అర్థం చేసుకోలేకుండా వున్నాను" అంది వాళ్లతోపాటు భోజనం చేస్తున్న హోటలు యజమానురాలు.

"ప్రశాంతంగా వుండే పొరుగుదేశంపై దాడి చేయటం కిరాతకం. అయితే, దేశం కోసం ప్రాణాలర్పించటం ప్రతి పౌరుడి పవిత్రకర్తవ్యం" అన్నాడు కార్నుడే.

"అవును. అది నిజమే కానీ, తమ సంతోషం కోసం యుద్ధం చేసే ఈ రాజులనందరినీ చంపేస్తే ఎంత బావుంటుంది?"

కార్నుడే కళ్లు మెరిశాయి. "మహబాగా చెప్పావు" అన్నాడు.

భోజనాలయ్యాయి. పడుకోటానికి ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లారు. ల్వాసోకు మాత్రం నిద్ర పట్టలేదు. 'కారిడార్ భాగోతా'లంటే అతనికిష్టం. ఓ గంట గడిచాక అతని ప్రయత్నం ఫలించింది. కార్నుడే, గుమ్మటం లోగొంతుతో మాట్లాడుకుంటున్నారు. గుమ్మటం అతన్ని తన గదిలోకి రానివ్వటం లేదు. ల్వాసోకు అన్ని మాటలూ వినబడలేదు. అంతలో వాళ్ల గొంతులు పెద్దవయాయి.

"నీవన్నీ అర్థం లేని భయాలు. ఇందులో జరిగే హానేముంది?" అంటున్నాడు కార్నుడే.

గుమ్మటం కోపంగా అంది: "ఛీ, ఛీ! ఇలాంటి పరిస్థితుల్లోనా? సిగ్గు చేటు!"

అతని కర్థమైనట్టు లేదు. సిగ్గెందుకు అన్నట్టున్నాడు. అప్పుడామె పెద్దగా అరిచినట్లుగా అంది: "ఎందుకా? ఎందుకని అడుగుతావు? హోటల్లో అంతటా ప్రష్యన్లు, మన పక్క గదిలోనే వాళ్లున్నప్పుడు, ఛీ ఛీ!"

అతను మౌనంగా వుండిపోయాడు. దేశభక్తితో కూడిన ఆ వేశ్య మాటలు అతనిలో నిద్రాణమై వున్న భావాలను జాగృతం చేసినట్టున్నాయి. అతను మారుమాట్లాడకుండా వెళ్లిపోయాడు. మాటేసిన ల్వాసోక్కూడా మరక్కడ పని లేదు. వెళ్లి పడుకున్నాడు.

మర్నాడు పొద్దున ఎనిమిది గంటలకల్లా వాళ్లు ప్రయాణమవటానికి హోటలు కిచెనులో జమయ్యారు. కానీ, గుర్రబ్బండి కారు కనిపించలేదు. గుర్రపుశాలలో చూశారు. అతన్ని వెతకటానికి బయలుదేరారు వాళ్లు. ఓ వైపున చర్చి, మరో వైపున ఇళ్లున్నాయి. అక్కడ ప్రష్యను సైనికులు కనిపించారు వాళ్లకు. ఓ సైనికుడు ఓ ఇంట్లో బంగాళాదుంపల పొట్టు తీస్తున్నాడు. మరో చోట మరో సైనికుడు క్షవరశాలను శుభ్రం చేస్తున్నాడు. ఇంకో చోట ఇంకో సైనికుడు బిడ్డను ఊయల్లో ఊపుతున్నాడు. కట్టెలు కొట్టటం, సూపు వండటం, కాఫీ గింజలు పట్టటం-ఓ ఇంట్లో ఓ ముసలావిడ బట్టలు కూడా ఉతుకుతున్నాడు. జమీందారుకు అదంతా ఆశ్చర్యమనిపించింది. ఓ ముసలతన్ని అడగ్గా అతనన్నాడు: "వాళ్లేం దుర్మార్గులు కాదు! ప్రష్యన్లట. ఎక్కడో దూరప్రాంతాల నుంచి వచ్చారు. పెళ్లాంబిడ్డలను వదలివచ్చారు. యుద్ధం వినోదమేం కాదు వాళ్లకు. ఇక్కడంత దుఃఖం లేకపోవటానికి కారణం వాళ్లు మనకేం కీడు చేయకపోవటం. వాళ్ల ఇంట్లో పని చేసుకున్నట్టే ఇక్కడా చేస్తున్నారు. బీదవాళ్లు ఒకళ్లకొకళ్లు సాయం చేసుకోవాలి."

విజితులకూ, విజేతలకూ మధ్య వున్న ఈ సత్సంబంధాలు చూసి కార్నుడే ఒళ్లు మండిపోయింది. ల్వాసో ఓ జోకేశాడు: "వాళ్లు మనదేశంలో జనాభా పెంచుతారు" అని.

"పాపప్రక్షాళన చేసుకుంటున్నారు వాళ్లు" అన్నాడు కారే లిమడాన్ గంభీరంగా.

వెతగ్గా వెతగ్గా బండివాడు ఓ కఫేలో కూర్చుని కనిపించాడు వాళ్లకు.

"ఎనిమిది గంటలకల్లా బండి సిద్ధం చేయమని చెప్పలా మేం నీకు?" అడిగాడు జమీందారు.

"అవును. ప్రష్యను కమాండరు నాకు మరో ఆర్డరు వేశాడు."

"ఏవిటది?"

"బండిని కట్టవద్దని!"


"ఎందువల్ల?"

"నా కా సంగతి తెలీదు. బండి కట్టొద్దన్నారు, కట్టను, అంతే!"

"నీకాయనే అలా అని చెప్పాడా?"

"లేదు. హోటలు యజమాని ద్వారా కబురు పెట్టాడు."

ముగ్గురు పురుషపుంగవులూ హోటలుకు తిరిగివచ్చారు. హోటలు యజమాని కోసం చూశారు. అతను ఉబ్బసం రోగి. ఉదయం పది గంటల వరకూ లేవడట. ప్రష్యను ఆఫీసర్ని కలవాలని వాళ్లనుకున్నారు కానీ హోటలు యజమాని, ఫాలెన్వీతో తప్ప మరెవరితోనూ అతను పౌరవ్యవహారాలు మాట్లాడడట. వాళ్లు



ఫాలెన్వీ కోసం నిరీక్షించారు. అతను పది గంటలకు కనిపించాడు. తన ఆదేశం లేకుండా ప్రయాణికుల బండి కదలటానికి వీల్లేదని ఆఫీసరు తనకు చెప్పాడట. జమీందారు, లమడాన్ ఆఫీసర్‌ను కలుసుకోవాలనుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తన్ను కలుసుకోవచ్చని అతను కబురు పెట్టాడు. జమీందారు, లమడక్, ల్వాసో వెళ్లారు. కార్నుడే "ఈ జర్మన్లతో నేనేం సంబంధం పెట్టుకో"నని చెప్పి వెళ్లలేదు.

వాళ్లు రావటం చూసి ఆఫీసరు అడిగాడు: "ఏం కావాలి మీకు?"

జమీందారు, "మేం వెళ్లిపోవాలనుకుంటున్నాం" అన్నారు, బృందానికి ప్రాతినిధ్యం వహిస్తూ.

"వీల్లేదు!"

"అనుమతి నిరాకరించటానికి మేం కారణం తెలుసుకోవచ్చా?"

"నాకిష్టం లేదు, అంతే!"

"కాని ఛీఫ్ జనరల్ గారు మాకు దీపే వెళ్లటానికి అనుమతించారు. మీకు కష్టం కలిగించే పని మేమేం చేయలేదు."

"నాకిష్టం లేదు. అంతే. మీరిక వెళ్లవచ్చు."

వాళ్లు తిరిగివచ్చారు. ఆఫీసరు బుర్రలో ఏముందో వాళ్ల కర్థం కాలేదు. అందరూ కలిసి పరిస్థితిని గురించి చర్చించారు. రకరకాల ఊహలు చేశారు. తమను బందీలు చేశారా? లేక హోస్టేజిలుగా పట్టుకున్నారా? తమ విడుదలకు ఎంత పెద్ద మొత్తాలు అడుగుతారు? ఈ ఆలోచన వాళ్లలో భయాన్ని కలిగించింది, ముఖ్యంగా ధనవంతులకు. తమ ప్రాణాలు కాపాడుకోటం కోసం బంగారు సంచులు ఆ దుష్టుడైన ఆఫీసరు కందించే దృశ్యం కూడా వాళ్లు ఊహించి భయకంపితులయారు. తాము బీదవాళ్లమని ఎలా చెప్పుకోవాలా అని ఆలోచించసాగారు.


వాళ్లు డిన్నర్‌కు వెళ్తున్న సమయంలో ఫాలెన్వీ వచ్చాడు. "ఎలిజబెత్ రూసే తన మనసు మార్చుకున్నదేమో కనుక్కురమ్మని నన్ను పంపారు" అన్నాడు.

గుమ్మటం నిలబడిపోయింది. ఆమె ముఖం పాలిపోయింది. ఆ తర్వాత కోపంతో ఆమె ముఖం ఎర్రబడిపోయింది. చివరికి కోపంగా అంది: "నువ్వెళ్లి ఆ దౌర్భాగ్యుడు, ఆ వెధవ, ఆ ప్రష్యను వెధవకి చెప్పు, నేనెప్పటికీ మనసు మార్చుకోనని! ఎప్పటికీ మార్చుకోనని చెప్పు!"

హోటలు యజమాని తిరిగి వెళ్లిపోయాడు. ప్రయాణికులంతా ఆమె చుట్టూ మూగారు. ఆఫీసరు ఏమడిగాడో చెప్పమని ఆమెను నిర్బంధించారు, ప్రార్థించారు, వేడుకున్నారు. ఆమె మొదట్లో సమాధానం చెప్ప నిరాకరించింది, చివరికి విసుగు పుట్టి చెప్పింది: "వాడికేం కావాలి? వాడికేం కావాలో నిజంగా మీకు తెలుసుకోవాలని వుందా? అయితే వినండి, వాడు నాతో గడుపుతాడట."

ఎవరి నోటా మాట రాలేదు. అందరూ ఆగ్రహంతో ఉడికిపోయారు. కార్నుడే అయితే కోపంతో బలంగా బల్లను బాది చేతిలోని గ్లాసు విరక్కొట్టాడు. వీళ్లు కిరాతకుల్లా ప్రవర్తిస్తున్నారని జమీందారు అన్నాడు. ప్రత్యేకంగా స్త్రీలు గుమ్మటం పట్ల ఎంతో సానుభూతిని వ్యక్తం చేశారు. క్రైస్తవసోదరీమణులు తలలు వంచుకున్నారు. మొదట వచ్చిన ఆగ్రహం కొంత తగ్గాక, వాళ్లు భోంచేశారు. కానీ, ఎవరూ మాట్లాడలేదు. ఆలోచనల్లో పడిపోయారు.

ఎక్కువ పొద్దుపోక ముందే స్త్రీలు పడుకోటానికి తమతమ గదుల్లోకి వెళ్లిపోయారు. మగవాళ్లు పేకాట ఆరంభించారు. హోటలు యజమాని




ఫాలెన్వీని కూడా ఆహ్వానించారు. ఈ ఆఫీసరు వ్యతిరేకత నెలా జయించాలా అని యథాలాపంగా అన్నట్లు అతన్ని ప్రశ్నలు వేశారు. "ఆట, ముందు ఆటాడండి" అన్నాడు కానీ, మరింకో విషయంపై అతను దృష్టి సారించలేదు. అతన్నుంచి ఇంకేం రాబట్టలేమని వాళ్లకు తెలిశాక, వాళ్లు ఆట ఆపేసి, తమ తమ గదులకు వెళ్లిపోయారు.

ఏదో విధంగా ఇక్కడి నుంచి వెళ్లిపోగలమనే చెప్పలేని ఆశతో వాళ్లు పొద్దున్నే నిద్ర లేచారు. ఆ దరిద్రపు హోటల్లో మరో రోజు గడపాలనే ఆలోచనే వాళ్లకు భయాన్ని కలిగిస్తోంది. గుర్రాలు గుర్రపుశాలలో వున్నాయి. బండివాడు మాత్రం కనిపించలేదు. ఏం తోచక వాళ్లు బయటికి అడుగుపెట్టారు, బండి చుట్టూ తిరిగారు.

బ్రేక్‌ఫాస్టేం బాగాలేదు. గుమ్మటం పట్ల ముభావంగా వుండటం మొదలుపెట్టారు వాళ్లు. రాత్రి నిద్రపోయాక వాళ్ల ఆలోచనల్లో మార్పులొచ్చాయి. ఆ రాత్రి ఆ పిల్ల ఆ ప్రష్యనుతో గడిపివుండినట్లయితే ఎంత బావుంటుంది అనుకున్నారందరూ. ఆ పని ఎంత సరళమైంది! ఆ పైన, ఎవరికి మాత్రం ఈ సంగతి తెలుస్తుందీ? తోటి ప్రయాణికుల దుస్థితి చూసి తనా పని చేయవూనుకున్నానని ఆఫీసరుకు చెప్పి, పరువు కాపాడుకోవచ్చు. అయినా ఆ పిల్లకు వీడైనా, వాడైనా పెద్ద తేడా ఏముంటుంది? అయితే, ఎవరూ ఈ ఆలోచనలకు మాటల రూపమివ్వలేదు.

అక్కడ వుండీ వుండీ, అందరికీ విసుగ్గా వుంది. "అలా ఊళ్లోకి వెళ్లొద్దాం, పదండి" అన్నాడు జమీందారు. కార్నుడే తప్ప మిగతా అందరూ బయలుదేరారు, తమ శరీరాలను ఉన్నబట్టల్లో కప్పుకుని. క్రైస్తవసోదరీమణులు చర్చిలో వుండటం వల్ల రాలేదు. నలుగురు స్త్రీలూ ముందు నడుస్తున్నారు. ముగ్గురు పురుషులూ వాళ్లను అనుసరించారు.

"ఈ పిల్ల మనను ఎప్పటికీ ఇక్కడే వుంచేలా వుంది" అన్నాడు ల్వాసో. "తనంతట తాను ముందుకు వచ్చి త్యాగం చేయటానికి సిద్ధపడితే తప్ప మనమేం చేయలేం" అన్నాడు ఎప్పుడూ మర్యాదగా మాట్లాడే జమీందారు. "ఫ్రెంచ్ సైనికులు దీపే గుండా వస్తే, తోట్స్‌లో తప్పకుండా పెద్ద యుద్ధం జరుగుతుంది" అన్నాడు కారే లమడాన్. ఈ ఆలోచన మిగతావాళ్లలో వణుకు పుట్టించింది. "మనం నడిచి వెళ్లిపోగలిగితే ఎంత బావుండు!" అన్నాడు ల్వాసో.

"మంచు ఇలా కురుస్తున్నప్పుడు అది జరిగే పనిటయ్యా-పైగా ఈ ఆడవాళ్లతో కుదిరే పనా?" అన్నాడు జమీందారు.

వాళ్లలా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. వీధి చివరి నుంచి ఠీవిగా వస్తున్న ఆఫీసరు కనిపించాడు వాళ్లకు. మహిళల పక్కగా నడుస్తూ అభివాదం చేశాడు, మగవాళ్ల వంక ఏహ్యంగా చూశాడు. అతన్ని చూడనట్టు అభినయించి పరువు కాపాడుకున్నారు పురుషులు. ఒక్క ల్వాసో మాత్రం హాట్ ఎత్తి అభివాదం చేసే ప్రయత్నం చేశాడు. గుమ్మటం ముఖం ఎర్రబడిపోయింది. తాము అలక్ష్యంగా చూసిన ఆ పిల్లతో కలిసి తమను ఆ ఆఫీసరు చూడటం వల్ల ఉడుకెత్తిపోయారు ఆ స్త్రీలు.

అయితే, వాళ్లతన్ని గురించి మాట్లాడారు. అతని రూపం, అతను ముఖం బాగానే అనిపించాయి లమడాన్ భార్యకు. అతను ఫ్రెంచ్ వాడైనట్లయితే, ఏ స్త్రీ అయినా అతని కోసం వెంపరలాడేదీ-అని

అందామె.

హోటలుకు తిరిగి వచ్చారు వాళ్లు. ఏం చెయ్యాలో తోచలేదు ఎవరికీ. భోజనాలయ్యాయి. నిశ్శబ్దంగా ఎవరి గదులకు వాళ్లు వెళ్లిపోయారు. మర్నాడు పొద్దున చర్చిలో బాప్టిజం జరుగుతూంటే చూద్దామని వెళ్లింది గుమ్మటం. ఆమె అలా వెళ్లగానే అందరూ కుర్చీలు దగ్గరికి లాక్కుని కూర్చున్నారు, నిర్ణయమేదైనా తీసుకోవాలని. ఆ పిల్లను ఒక్కదాన్నీ అక్కడుంచి, తమను పంపెయ్యొచ్చుగా-ల్వాసో ఆలోచన అది. హోటల్ యజమాని ఫాలెన్వీ ద్వారా ఆఫీసరుకు వర్తమానం పంపారు. అతనికి మానవస్వభావం తెలుసు. తన కోరిక ఈడేరనంతవరకూ ఎవరూ ఊరు విడిచిపోవటానికి వీల్లేదని కబురు పంపాడు అతను.

అప్పుడు ల్వాసో భార్య తన లేకితనాన్ని వ్యక్తపరుస్తూ అంది: "మనకు ముసలితనం వచ్చేస్తుంది, ఇక్కడ వుండీ వుండీ. దాని వృత్తే అది-అందరికీ వసతి కల్పించటం. మరలాంటప్పుడు వీడిని తిరస్కరించటంలో అర్థమేమిటో నాకు తెలియటం లేదు. రూవెన్‌లో అది బండివాళ్లతో కూడా పక్క పంచుకుంది. అలాంటిదానివల్ల మనం ఇవాళ ఇన్ని అవస్థలు పడాల్సివచ్చింది. నా అభిప్రాయంలో ఆఫీసరు ప్రవర్తన మర్యాదగానే వుంది. పాపం, ఎంత కాలం నుంచి పొందు లేక కష్టాలు పడుతున్నాడో అతను! మన ముగ్గురినీ కోరినా తప్పు లేదు. కానీ, అలా జరగలేదే! ఉమ్మడి ఆస్తిలో తనకూ భాగం ఇమ్మన్నాడు. వివాహిత స్త్రీల పట్ల గౌరవంగా వుంటాడతను. పైగా అతను ఇక్కడ అధికారి. 'నాక్కావాలి' అంటే చాలు, సైనికులు బలవంతంగా మననందరినీ తీసుకెళ్లి అతని కాళ్ల ముందు పడేసినా మనకు దిక్కు లేదు!"

మిగతా ఇద్దరు స్త్రీలూ వణికిపోయారు. కారే లమడాన్ భార్య ముఖం పాలిపోయింది. ఆఫీసరు బలవంతంగా తన్ను పట్టి తీసుకెళ్తున్న దృశ్యం ఆమె ఊహించసాగింది.

మగవాళ్లు కలిసి విషయాన్ని చర్చించారు. కాళ్లూ, చేతులూ కట్టేసి ఆ ముండను శత్రువు కప్పగించాలన్నాడు ల్వాసో. మూడు తరాలుగా రాయబారులుగా పని చేసిన రక్తం ప్రవహిస్తోంది జమీందారు శరీరంలో. "అంత కంటే వేరే మార్గమేమన్నా వుంటే చూద్దాం"మన్నాడు అతను. అందరూ వచ్చి కుట్ర పన్నసాగారు. ప్లానులు వేశారు. ఎవరు ఎట్లా మాట్లాడాలో తేల్చుకున్నారు. ఒక్క కార్నుడే మాత్రం వీటన్నిటికీ దూరంగా వున్నాడు.

గుమ్మటం చర్చి నుంచి వచ్చాక, మధ్యాహ్నం లంచ్ సమయం దాకా స్త్రీలందరూ ఆమెతో చాలా స్నేహంగా మెలిగారు. అందువల్ల ఆమె మరింత ఒద్దికగా తమ పట్ల ప్రవర్తించేటట్లూ, తామిచ్చిన సలహాతో ఆమెకు విశ్వాసం కుదిరేటట్లూ మాట్లాడారు వాళ్లు. భోజనం టేబుల్ దగ్గర అసలు దాడి ప్రారంభమైంది. ప్రాచీన ఉదాహరణలు ప్రస్తావించారు. జూడిత్, హోలో ఫెర్నెస్‌ల ఉదాహరణలిచ్చారు. లూక్రీ, సెక్టస్‌ల సంగతి చెప్పారు. క్లియోపాత్రా ఎలా ఎందరు శత్రుసేనానులను తనకు దాసులుగా చేసుకుందో చెప్పారు. పురుషులు యుద్ధంలో ఓడిపోయినా, స్త్రీలు శత్రువుల నెలా చుట్టుముట్టి చివరికి విజయాన్ని పొందారో చెప్పారు. ఓ ఇంగ్లీషు స్త్రీకి ఎలా భయంకరమైన అంటువ్యాధిని ఇనాక్యులేట్ చేసి బోనాపార్టీని చంపటానికి పంపిందీ, చివరికతను జబ్బు చేసి ఆమెను కలవలేకపోయాడు కానీ, లేకపోతే చనిపోయేవాడేననీ చెప్పారు వాళ్లు. ఈ మాటలన్నీ ప్రేమగా, స్నేహాన్ని వెలారుస్తూ చెప్పారు. అలాంటి గొప్పవాళ్ల త్యాగపథంలో పయనించటమే ఆమె కర్తవ్యమన్నట్టు చెప్పారు.

ఈ మాటలన్నీ విన్న గుమ్మటం ఏం మాట్లాడలేదు. ఆ రోజు మధ్యాహ్నమంతా ఆమెను ఆలోచించుకోనిచ్చారు వాళ్లు.

రాత్రి భోజనమప్పుడు, హోటలు యజమాని, ఫాలెన్వీ పాతపాటే పాడుతూవచ్చాడు: "ఎలిజబెత్ రూసే గారు తమ మనసు మార్చుకున్నారేమో తెలుసుకు రమ్మని ప్రష్యన్ ఆఫీసరు గారు నాకు ఆదేశమిచ్చారు" అంటూ.


గుమ్మటం పొడిపొడిగా అంది: "లేదండీ!" అని.


ఇంక టేబుల్ దగ్గర కూర్చున్న జనమంతా ఆలోచించసాగారు, కొత్త ఉదాహరణ లేమన్నా దొరుకుతాయేమోనని. వాళ్లకు ఒక్కటీ తట్టలేదు. అప్పుడు జమీందారిణి సెయింట్ల జీవితాల్లోని గొప్ప సంఘటలను గురించి చెప్పమని పెద్ద సిస్టర్ని అడిగింది. వాళ్లు చేసిన పనులు మనబోటి వాళ్ల దృష్టిలో నేరాలుగా కనిపిస్తాయి. కానీ, చర్చి అవి పాపాలు కావన్నది. ఎందుకూ? వాళ్లు ఏం చేసినా దేవుడి ఘనత స్థాపించటం కోసం చేశారు, ప్రజాబాహుళ్యక్షేమం కోసం చేశారు. అలా చాలాసేపు మాట్లాడాక పెద్ద సిస్టర్ని అడిగింది: "నువ్వు చెప్పు, సిస్టర్! ఉద్దేశం పవిత్రమైందైనప్పుడు, దేవుడు ఉద్దేశాన్ని స్వీకరించి, కర్మలను క్షమించేస్తాడంటావా, లేదా?"

"అందులో సందేహించటానికేముంది మేడం? ఓ కర్మ కళంకపూరితమే కావచ్చు. కానీ, ఎలాంటి ఆలోచనల నుంచి అది జనించిందో అదే ముఖ్యం. కనుక ఆలోచనను బట్టి అది పుణ్యకార్యమవుతుంది."

అలా భగవంతుడి ఇచ్ఛలను వెలారుస్తూ వాళ్లు మాట్లాడారు. అయితే, పవిత్రురాలైన ఆ క్రైస్తవసోదరీమణి చెప్పిన ప్రతి మాటా ఆ తుచ్ఛవేశ్య వ్యతిరేకతను భగ్నం చేయటంలో కృతకృత్యమైంది. ఆ తరువాత సిస్టర్, తమ సుపీరియర్ గురించీ, తమను గురించీ చెప్పింది. మశూచితో బాధ పడుతూ మృత్యుముఖంలో వున్న వందలాది సైనికుల సేవ కోసం తమను హావ్రే పంపిస్తున్నారట. ఈ ప్రష్యను ఆఫీసరు తమను ఆపేయటంతో, బతకవలసిన ఎంతోమంది ఫ్రెంచ్ సైనికులు మృత్యువు వాత పడతారని ఆమె బాధ పడుతూ చెప్పింది. ఆమె మాట్లాడిన తరువాత మరెవరూ మాట్లాడలేదు.

మర్నాడు లంచ్ నిశ్శబ్దంగా ముగిసింది. మధ్యాహ్నం తిరిగి రావటానికి ఊళ్లోకి వెళ్లారు వాళ్లు. జమీందారు గుమ్మటంతో చాలా ప్రేమగా మాట్లాడాడు. చివరికన్నాడు: "అయితే, అపజయం తర్వాత కొనసాగే హింసకు నువ్వు మమ్మల్ని పాల్పడజేస్తావన్నమాట, నీ జీవితంలో అంతకు ముందు ఎందరినో అనుగ్రహించిన దాన్ని అతనికి నిరాకరించి! సరే కానీ" అని. ఆ తర్వాత ఆ మాటలూ ఈ మాటలూ చెప్పి, "చూడమ్మాయ్, అతనికీ గొప్పగా చెప్పుకోటానికేదైనా కావాలిగా? తన దేశంలో అలభ్యమయ్యే అందమైన అమ్మాయిని ఫ్రాన్సులో తను






కలుసుకున్నానని చెప్పుకోవాలిగా?" అనీ అన్నాడు.

గుమ్మటం ఆ మాటలకేం సమాధానం చెప్పలేదు. హోటలుకు వెళ్లగానే తనగదిలోకి వెళ్లి తలుపేసుకుంది. మళ్లీ ఎవరికీ కనిపించలేదు. ఆ పిల్ల ఇంకా అలాగే నిరాకరిస్తూవుంటే తమకిక అధోగతే అని అందరూ మనస్తాపపడసాగారు. డిన్నరు గంట మోగింది. అందరూ టేబుల్ దగ్గర వచ్చి కూర్చున్నారు. "రూసేకు ఒంట్లో బాగుండలేదు, అందువల్ల ఆమె ఇప్పుడు భోజనానికి రాదు" అని వచ్చి చెప్పాడు హోటల్ యజమాని ఫొలెన్వీ. జమీందారు అతని దగ్గరగా వెళ్లి స్వరం తగ్గించి అడిగాడు: "అతడు లోపల వున్నాడా?"

"అవును."

అతను పైకేం అనలేదు గానీ, తల వంకించి సంజ్ఞ చేశాడు. అందరి హృదయాలూ సేదదీరినట్లయ్యాయి. ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. హాయిగా మాట్లాడుకోసాగారు వాళ్లు. అంతలో ల్వాసో, "ష్, మాట్లాడకండి" అని కళ్లూ, చేతులూ సీలింగ్ వైపు ఎత్తి వింటూ అన్నాడు: "బాగుంది. అంతా సక్రమంగానే జరుగుతోంది."

వాళ్లు మొదట్లో అర్థం చేసుకోలేకపోయినా, వెంటనే నవ్వులతో భళ్లుమన్నారు. వాళ్ల అభిరుచిని వెలారుస్తూ కుళ్లు జోకులు వేసుకున్నారు. ఆ తర్వాత ల్వాసో గ్లాసెత్తి, "మన విడుదల కోసం తీర్థం పుచ్చుకుంటున్నాను" అన్నాడు. ఇంత కోలాహలంగా వున్నా కార్నుడే ఒక్క మాట మాట్లాడలేదు. గంభీరంగా, ఎందుకో కోపంగా వుండిపోయాడు.

"ఏం మిత్రమా, నువ్వేం సరదాగా లేవు, ఇవ్వాళ?" అనడిగాడు ల్వాసో కార్నుడేను.

కార్నుడే ఒక్కసారిగా తలెత్తి, తీక్ష్ణంగా చూస్తూ అన్నాడు: "మీ కందరికీ ఇవ్వాళ దక్కేది అవకీర్తి తప్ప మరేం లేదు. ఇంక కంటే దౌష్ట్యం మరేదీ లేదు" అని ఆ పైన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ల్వాసో మొదట తగ్గిపోయినా, మళ్లీ ఉత్సాహాన్ని పుంజుకున్నాడు. 'కారిడార్ భాగోతం' గురించి చెప్పాడు. "నిజమా, నువ్వు చూశావా?" అనడిగాడు జమీందారు, కారేలమడన్‌ను.

"అవును. నా కళ్లతో చూశాను. ప్రష్యను ఆఫీసరు పక్క గదిలో వున్నాడని అది తిరస్కరించింది."

"అసాధ్యం!"

"ఒట్టు పెట్టుకు చెప్తున్నాను."

అందరూ గుక్క తిప్పుకోలేనట్లు నవ్వారు. "అందుకే వాడలా వున్నాడు" అన్నాడు ల్వాసో.

మర్నాడు ఉదయం ఆకాశం నిర్మలంగా వుంది.మంచు మీద సూర్యకిరణాలు పడి మెరుస్తున్నాయి. బండి ప్రయాణానికి సిద్ధమై హోటలు తలుపు దగ్గర నిలబడివుంది. తక్కిన ప్రయాణాని కవసరమైన తినుబండారాలు మూట కట్టుకుని, ప్రయాణికులందరూ బండెక్కారు. గుమ్మటం కోసం నిరీక్షించారు. చివరికి ఆమె వచ్చింది.

ఆమె ముఖం సిగ్గుతో కుంచించుకుపోయింది. పిరికిగా, ఆమె తన సహప్రయాణికుల వంక చూసింది. వాళ్లు ముఖాలు పక్కకు తిప్పుకున్నారు. జమీందారు అపవిత్రమైన గుమ్మటం స్పర్శ సోకకుండా భార్యను తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. గుమ్మటం పారిశ్రామికుడి భార్యకు అభివాదం చేసింది కానీ ఆమె ఏం మాట్లాడలేదు. గుమ్మటం బట్టల్లో ఏదో అంటురోగం వున్నట్టు అందరూ ఆమెకు దూరంగా తొలగారు.

బండి మెల్లగా కదిలింది. మిగిలిన ప్రయాణం మొదలైంది. ఎవరూ ఆమెతో మాట్లాడలేదు. గుమ్మటానికి కళ్లెత్తి చూసే ధైర్యం లేకపోయింది. సహప్రయాణికుల పట్ల ఆమెకు కోపంగా వుంది. వీళ్లే కపటంగా తనను ఆ ప్రష్యను వెధవ మురికిచేతుల్లోకి తోశారు. అతనికి లొంగిపోయిన అవమానభారం ఆమెను బాధించింది. ఆమెను వదిలేసి, అక్కడ ఆమె లేనట్టే అందరూ మాట్లాడుకోసాగారు. మూడు గంటల ప్రయాణమయ్యాక, ల్వాసో అన్నాడు: "నాకు ఆకలి వేస్తోంది" అని. అతని భార్య కింద వున్న బుట్ట తీసింది. అందరూ తాము తెచ్చుకున్న ఆహారాన్ని తినసాగారు. గుమ్మటం తన హడావుడిలో ఏం తెచ్చుకోలేకపోయింది. తన్నే మాత్రం గమనించకుండా పొట్టలు పగిలేట్టు తింటున్న వాళ్ల వంక ఏహ్యంగా చూసింది. వాళ్లను తిడదామన్నంత కోపం ఆమెకు వచ్చింది. కానీ ఆమె నోరెత్తలేకపోయింది. ఘృణతో ఆమె నోరు మూసుకుపోయింది.

ఎవరూ ఆమెను చూడలేదు. ఆమెను పట్టించుకోలేదు. తనను మొదటగా బలి పెట్టి, ఆ తర్వాత పనికిరాని వస్తువులా చెత్తకుండీలోకి విసిరేసిన ఆ దుర్మార్గసజ్జనుల ఏహ్యతలో తను మునిగిపోయినట్లుగా ఆమె భావించింది. ప్రయాణం మొదటి రోజున తను వాళ్ల కందించిన ఆహారపదార్థాలూ, తినుబండారాలూ, డ్రింకులూ ఆమెకు గుర్తుకు వచ్చాయి. ఆమెకు దుఃఖం ముంచుకువచ్చింది. ఎంతో ప్రయత్నం చేసి కానీ ఆమె తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. తన్నుకొస్తున్న వెక్కులను మింగేసింది. కానీ, కళ్ల నుంచి కారుతున్న కన్నీళ్లను ఆమె ఆపలేకపోయింది.

జమీందారిణి ఆమె దుఃఖాన్ని గుర్తించింది. సంజ్ఞ చేసి భర్తకు చెప్పింది. అతను భుజాలు కుదించుకుంటూ, 'అందుకు నన్నేం చేయమంటావు? అది నా తప్పు కాదు!' అన్నట్టు ప్రవర్తించాడు.

"సిగ్గుతో అది ఏడుస్తోంది" అంది గుసగుసగా ల్వాసో భార్య.

క్రైస్తవసోదరీమణులు తాము తినగా మిగిలిందాన్ని పేపర్లో చుట్టి ప్రార్థన చేసుకోసాగారు. ఆత్మారాముణ్ని శాంతింపజేసుకున్న కార్నుడే పాటను హమ్ చేసుకోసాగాడు.

మంచు గట్టి పడింది కనుక వాళ్ల ప్రయాణం త్వరగా సాగింది. కుదువుల రోడ్డులో. ముసురుకుంటున్న చీకటిలోకి బండి పయనించింది.

గుమ్మటం తోవ పొడుగూతా ఏడుస్తూనేవుంది. అప్పుడప్పుడూ ఆమె ఆపుకోలేని వెక్కు, ఆ రెండు సీట్ల వరసల మనుషుల నీడల మధ్యా ప్రతిధ్వనించింది.

■